క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలు లోపభూయిష్టం

అయిజ: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ లోపభూయిష్టంగా ఉన్నాయని బహుజన సమాజ్ పార్టీ నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి గణపురం కృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక విధానమంటూ లేకుండా ఇష్టారాజ్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, ఉపాధ్యక్షుడు మణి కుమార్, కార్యదర్శి వెంకటేష్ నాయక్, నియోజకవర్గం ఉపాధ్యక్షుడు సుంకన్న పాల్గొన్నారు.

సభ్యత నమోదులో బీజేపీ ఆదర్శం

గద్వాలటౌన్: బీజేపీ సభ్యత నమోదులో అన్ని పార్టీలకు ఆదర్శంగా నిలుస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీలో ఉన్న అనుబంధ మోర్చాల సభ్యత నమోదులో నాయకులు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ప్రతి మోర్చా అయిదు వేల సభ్యత్వ నమోదుకు తగ్గకుండా చూడాలన్నారు. సోమవారం నుంచి జిల్లా కేంద్రంలో సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్, రామంజనేయులు, బండల వెంకట్రాములు, కౌన్సిలర్ కుమ్మరి శ్రీను, కృష్ణవేణి, బండల పద్మావతి, డబ్బిలేటి నర్సింహ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన డ్రైవర్ స్వాములుకు రెండు నెలల క్రితం పక్షవాతం రావడంతో ప్రైవేట్ వాహన డ్రైవర్స్ సంఘం సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. పరిస్థితి విషమించి స్వాములు ఈనెల 1న చనిపోవడంతో బాధిత కుటుంబానికి డ్రైవర్స్ యూనియన్ నాయకులు రూ.12వేలు స్వాములు భార్య ఎల్లమ్మకు అందజేశారు. కార్యక్రమంలో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు తెలుగు శ్రీనివాసులు, డ్రైవర్లు మర్దన్, మౌలాలి పాల్గొన్నారు.

మృతదేహానికి అంత్యక్రియలు



అయిజ: తుంగభద్ర నదిలో కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మృతదేహానికి పోలీసులు అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. తుంభద్ర నది ప్రవాహంలో గుర్తు తెలియని మృతదేహం(60) పైనుంచి కొట్టుకొచ్చి మండలంలోని కేశవరం గ్రామ సమీపంలో ఒడ్డుకు చేరింది. కుళ్లిన మృతదేహాన్ని గమనించిన బాటసారులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ పోలీస్ బృందంతో సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. వైద్యులు సంఘటనా స్థలంలోనే పోస్టుమర్టం నిర్వహించారు. అనంతరం మృతదేహానికి అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు: వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి: బైక్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి గాయాలైన సంఘటన మండలంలోని ఉండవెల్లి శివారులో జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా ప్రాగటూరుకు చెందిన శేఖర్, జయలక్ష్మి దంపతులు బైక్‌పై బియ్యం సంచితో హైదరాబాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న శేఖర్ కాలు విరిగింది. జయలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ రామ్మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

ఉండవెల్లి: కారును గుర్తు తెలియని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని అలంపూర్ చౌరస్తాలో ఫ్లైఓవర్‌పై ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా కోయిలకుంట్లకు చెందిన ముగ్గురు వ్యక్తులు హైదరాబాద్ నుంచి వెళ్తున్న క్రమంలో అలంపూర్ చౌరస్తాలో ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. కారులో ఉన్న నదిత, మనిదీపలకు స్వల్ప గాయాలు కావడంతో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

బాలిక అదృశ్యం

ఉండవెల్లి: మండల కేంద్రంలో బాలిక(16) కనబడుటలేదని తండ్రి రంగన్న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం శనివారం తెల్లవారుజామున బాత్రూంకు వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో తల్లి కర్ణమ్మ చుట్టుపక్కల వెతికినా ఆచూకీ కనిపించలేదు. తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఇంట్లో కిరాయికి ఉన్న బోయ శంకర్‌పై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



శాంతినగర్‌లోని రామచంద్రానగర్‌లో వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో విఘ్నేశ్వరునికి భక్తుల పూజలు



అయిజలో వినాయకుడి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



చెన్నిపాడులో వినాయక మండపం వద్ద అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చంద్రకాంత్



ధరూరులో గతేడాది లడ్డూ వేలం డబ్బులు అందజేస్తున్న భక్తుడు వెంకటేశ్వర్‌రెడ్డి

గణనాథుడికి ఘనంగా పూజలు

- అలంపూర్‌లో మట్టి విగ్రహాల పంపిణీ
- గల్లిగల్లిలో వినాయక విగ్రహాల ఏర్పాటు
- ప్రత్యేక అలంకరణలో మండపాలు

అలంపూర్ రూరల్: అలంపూర్ మండలంలో శనివారం ఘనంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. గల్లిగల్లీలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. వివిధ రకాల అలంకరణలో వినాయక మండపాలను ఏర్పాటు చేశారు.

250 మట్టి విగ్రహాల పంపిణీ

పట్టణంలోని పాత మున్సిపాలిటీలో శనివారం ప్రభుత్వం నుంచి కలెక్టర్ ఆదేశానుసారం 250 మట్టి చిన్న వినాయకుని విగ్రహాలను భక్తులకు పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, నాయకులు డాక్టర్ రాజన్న, ముక్కార్ బాషా, దేవరాజ్, సిబ్బంది రామాంజనేయులు, వినోద్ ఉన్నారు.

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో గణనాథులకు ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అర్చకులు గణనాథులకు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.మండపాల వద్ద భజన మండలిసభ్యులు భజన కార్యక్రమం నిర్వహించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పట్టణంలోని వడ్డేపల్లి, శాంతినగర్, పైపాడు, రామచంద్రానగర్, రామాలయవీధి, జమ్ములమడుగు, మారుతీనగర్, మండలంలోని ఆయా గ్రామాల్లో మండపాలు ఏర్పాటుచేసి, విద్యుద్దీపాలు, పచ్చని తోరణాలతో అలంకరించి, విఘ్నేశ్వరుల ప్రతిమలను ప్రతిష్ఠించారు. బ్రాహ్మణులతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన పిండివంటలు, ఉండ్రాళ్లపాయసం, ఫల, పుష్పాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏకదంతుని నామస్మరణలు వీధుల్లో మార్మోగుతోంది.



గట్టులో ఏర్పాటు చేసిన గణపయ్య వద్ద భక్తులు

అయిజ: మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో, మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆదివారం వినాయకుడి విగ్రహాలకు భక్తులు పూజలు చేశారు.

మానవపాడు: శాంతియుత వాతావరణంలో గణేశుని ఉత్సవాలు నిర్వహించాలని ఎస్ఐ చంద్రకాంత్ సూచించారు. ఆదివారం మండలంలోని చెన్నిపాడులో వినాయక ఉత్సవ నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో వినయకుని ఉత్సవాలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని మండపాల్లో గణ నాథులు కొలువు దీరాయి. నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయకులను ఏర్పాటు చేశారు.

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వినాయక చవితి పండుగ ఘనంగా నిర్వహిస్తున్నారు. తాము చేసే పనుల్లో విఘ్నాలు తొలగించి, ఎలాంటి అవరోధాలు లేకుండా పనులు ముందుకు సాగాలని ప్రత్యేక పూజలు చేశారు.

గట్టు: గణనాథులను వాడ వాడలా ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలను నిర్వహించారు. బల్గెర, గట్టు గ్రామాల్లో గణేష్ మండపాలను మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల సందర్శించి, పూజల్లో పాల్గొన్నారు. గట్టులో భవాని ఆలయం ఏర్పాటు చేసిన వినాయక మండపం దగ్గర దాత రాజప్ప, నగర వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం దగ్గర కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక చవితి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అమరవాయిలో కుంభేశ్వరస్వామి దేవాలయంలో వినాయకుని 12సంవత్సరాలుగా ప్రత్యేకపూజలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా లడ్డును 110 కేజీలతో ఏర్పాటు చేసి ప్రత్యేక వేలం వేయనున్నట్లు తెలిపారు.

ఎరవల్లి: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎర్రవల్లిలో అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, కొండేరులో పోతురాజు శంకరమ్మ ట్రస్ట్ చైర్మన్ సోమనాద్రిలు కుటుంబ సమేతంగా ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. రెండో రోజు ఆయా గ్రామాల్లో మహిళలు, చిన్నారులు పిండి వంటలతో నైవేద్యంగా సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. మండపాలకు వినాయకుని విగ్రహాలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 70 వినాయకులను ఏర్పాటు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. రెండో రోజు స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయకుని వద్ద దాత సర్వేశ్వర్ రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.



ఎర్రవల్లిలో పూజలు చేస్తున్న అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి




ధరూరులో ఈశ్వరుని ఆలయంలో కొలువుదీరిన వినాయకుడికి పూజలు చేస్తున్న అర్చకులు



ఉండవెల్లిలో ప్రతిష్ఠకు వినాయకుని ఊరేగిస్తూ తీసుకెళ్తున్న యువకులు



అమరవాయిలో ఏర్పాటు చేసిన 110 కేజీల లడ్డు



అలంపూర్‌లోని సాలేవీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడు

అలుగు పారుతూ.. ఆహ్లాదం పంచుతూ

ధరూరు: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. అలుగు పారుతున్న చెరువుల వద్ద ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తోంది. మండలంలోని కోతులగిద్ద కూసోని చెరువు నుంచి గద్వాల–రాయచూరు రహదారిలో కొత్తపాలెం స్టేజీ సమీపంలో రాయచూరోని చెరువు వద్ద అలుగు అత్యంత అహ్లాదాన్ని పంచుతోంది. రాయచూరు రహదారి గుండా వెళ్తున్న వాహనదారులు, బాట సారులను ఆకట్టుకుంటోంది. ప్రకృతి అందాలను తిలకించేందుకు ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు.



గద్వాల - రాయచూరు రహదారి పక్కన అలుగు పారుతున్న రాయచూరోని చెరువు

డీజే మోగితే చట్టపరమైన చర్యలు

అలంపూర్ రూరల్: మండపాలలో వినాయకుని ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఇన్‌చార్జి ఎస్ఐ ఎండీ బాషా అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విలేకరులతో మాట్లాడారు. డీజేలకు అనుమతి లేదని, గ్రామాల్లో డీజే మోగితే యజమానులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. మీ సేవలో అప్‌లై చేసిన క్యూఆర్‌కోడ్ కాగితాలు మండపం వద్ద తప్పనిసరిగా ఉండాలన్నారు. అలంపూర్ మున్సిపాలిటీ, మండలం లోని ఆయా గ్రామాల వినాయక కమిటీ వారు పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

మండల కేంద్రానికి దారేది?

పాఠశాల విద్యార్థులకు అవస్థలు



అమరవాయి–మానవపాడు ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు



చెన్నిపాడు–పెద్దపోతులపాడు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం

మానవపాడు: మండల కేంద్రానికి వెళ్లేందుకు రహదారులతో వర్షం కురిస్తే ఇబ్బందులు తప్పడం లేదు. మానవపాడుకు వెళ్లేందుకు మానవపాడు–చెన్నిపాడు మధ్య వాగు, గోకులపాడు నుంచి మానవపాడు మధ్యలో వాగు, అమరవాయి నుంచి మానవపాడు మధ్యలో వాగు, జాతీయ రహదారి నుంచి వచ్చే దారిలో అండర్ రైల్వే బ్రిడ్జి వద్ద వర్షం కురిస్తే వాగులు, వంకలు నీరు నిలిచి రాకపోకలకు వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. చెన్నిపాడు బ్రిడ్జి రూ. 2.5కోట్లతో నిర్మించారు. వర్షం వస్తే ప్రయాణం చేయాలంటే బురదతో బ్రిడ్జి పైకి ఎక్కిపోవాలంటే వాహనాలు ప్రమాదకరంగా ఉన్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. చాలా సార్లు బ్రిడ్జి ప్రమాదకరంగా ఉందని అధికారుల తెలిపినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. చాలా పాఠశాలలకు వెళ్లే ప్రైవేట్ బస్సులో బురదలో ఇరుకున్న పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు ఇలా.. వెళ్లేదెలా!

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే మట్టిరోడ్డు

జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. మట్టి రోడ్డు కావడంతో తేలికపాటి జల్లులు కురిసినా బురదమయంగా మారింది. పెద్ద పెద్ద గుంతల్లో వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తోంది. క్రయ, విక్రయదారులు కార్యాలయానికి వచ్చి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

– గద్వాల అర్బన్

దీప్‌దాస్ మున్షీని కలిసిన గద్వాల నాయకులు



గద్వాల: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏఐసీసీ కార్యదర్శి దీప్‌దాస్ మున్షీని ఆదివారం గద్వాల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గద్వాలలో పార్టీ పరిస్థితులు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు సీనియర్ నేత అమరవాయి కృష్ణారెడ్డి తెలిపారు. అన్ని విషయాలు సామరస్యంగా విన్న ఆమె పార్టీకి నష్టం వాటిల్లకుండా అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మోహన్‌రావు, మధుసూదన్‌బాబు, అచ్చన్నగౌడ్, లత్తీపురం వెంకట్రాములు, డీఆర్ శ్రీధర్ ఉన్నారు.

మైనార్టీ నాయకులతో సీఐ సమీక్ష సమావేశం

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని గాంధీచౌక్ సమీపంలోని అమీనొద్దీన్ బాబా దర్గాలో శనివారం మైనార్టీ నాయకులతో సీఐ రవిబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 16న జరిగే మీలాద్ ఉన్ నబీ జూలుసును 19కి మార్చుకోవాలని సీఐ మైనార్టీ నాయకులను కోరారు. 16న వినాయకుని నిమజ్జనం ఉండడంతో 3 రోజులు మార్పు చేసుకోవాలని సీఐ వారిని కోరారు. అందుకు మైనార్టీ నాయకులు అంగీకరించారు. ఇన్‌చార్జి ఎస్ఐ బాషా, నాయకులు అబ్దుల్ మూజీప్, రుక్మొద్దీన్, అల్లాబకాష్, షాఫీ ఆహ్మద్, ఖలీల్, షాలీబాషా, షరీఫ్, ఇబ్రహీం, ఇర్షాద్, శాలీమియ్య, ఇంత్యాజ్ తదితర మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసి నాయకులు



గద్వాల అర్బన్: నూతనంగా టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్ గౌడ్‌ను ఆదివారం హైదరాబాద్‌లో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మునుగాలలో వైద్య శిబిరం

ఎర్రవల్లి: ఇటిక్యాల మండలంలోని మునుగాలలో ఆదివారం వికారాబాద్ మా శారద ఆస్పత్రి మరియు ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోలిస్టిక్ హెల్త్‌కేర్ వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జనరల్ సర్జన్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ కొప్పుల శైలజ, డాక్టర్ వేదలు హాజరై గ్రామంలో 370 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 280 మందికి పైగా రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం మా శారద ఆస్పత్రి వైద్యులను గ్రామస్తులు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొప్పుల జయలక్ష్మి, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో గడ్డిమందు పిచికారీ

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, గడ్డి పెరగడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో స్పందించిన గ్రామ యువకులు గడ్డిమందు పిచికారీ చేయించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ ప్రాథమికోన్నతపాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి విషసర్పాలు సంచరిస్తున్నాయని, ఆటలు ఆడుకోడానికి ఇబ్బందికరంగా మారిందని విద్యార్థులు తల్లిదండ్రులతో వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ యువకులు, మండల బీజేవైఎం వెంకటేష్‌యాదవ్, ఓబులేసుగౌడ్, గోపాల్, అంజి, సోమన్న, రత్నంలు పాఠశాలకు చేరుకున్నారు. వెంటనే గడ్డిమందు తెప్పించి పిచికారీ చేయించారు. నాలుగైదు రోజుల్లో గడ్డంతా ఎండిపోతుందని, విద్యార్థులకు ఇబ్బంది ఉండదని యువకులు పేర్కొన్నారు. సమస్య పరిష్కరించిన యువకులకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



జూలెకల్ పాఠశాల ఆవరణలో గడ్డిమందు పిచికారీ చేస్తున్న యువకులు

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టక పోడంతో ఆయా కాలనీలు మురుగును తలపిస్తున్నాయని, వెంటనే పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని దేవనగర్ కాలనీని బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో రోడ్లపై మురుగు దుర్వాసన వెదజల్లుతుందని, దోమలు ఉధృతిచెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. పారిశుద్ధ్యం పనులు చేపట్టకుంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమసేన్ రావు, మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.



మురుగును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

వర్షాలకు పంటలు నష్టం

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

మానవపాడు: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు విలవిలలాడుతున్నారు. మండలంలోని 16 గ్రామాల్లో మిర్చి, కంది, పత్తి, బెండ, పొగాకు తదితర పంటల్లో వర్షం నీరు నిలిచి దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పంట పొలాలను పరిశీలించాలని సూచించారు. మండలంలోని అమరవాయి, మానవపాడు, గోకులపాడు, చెన్నిపాడు, నారాయణపురం, పెద్దఆముదాపాడు, పోతులపాడు గ్రామాలలో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.



మానవపాడు శివారులో వర్షం దెబ్బకు ఎండిపోయిన కంది

పొంగిపొర్లుతున్న కుంటలు, చెరువులు

గద్వాల: అల్పపీడ ప్ర భావంతో రాత్రి సమయంలో వర్షం కురుస్తోంది. రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తుండడంతో ఎక్కడికక్కడ కుంటలు, చెరువులు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. గద్వాల పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు కుంట వీధి, నల్లకుంట, సుంకులమ్మమెట్టు, రెవెన్యూ కాలనీ, శ్రీనివాస్ కాలనీ, చింతలపేట కాలనీలలో రోడ్లు, డ్రెయినేజీలు వర్షం నీటితో నిండిపోయాయి. పాత ఎంపీడీఓ కార్యాలయం, రాజీవ్ మార్గ్, కొత్తబస్టాండ్, తేరుమైదానం వంటి ప్రధాన ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి ఇబ్బందికరంగా మారింది.